క్లుప్తంగా

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



లక్ష్మీదేవికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ : సంక్రాంతి పండుగ అనంతరం అయా గ్రామాల్లో అమ్మవార్లకు పూజలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురువారం మండలంలోని ఇంజేడు, ఉయ్యాలవాడ, సుద్దమల్ల గ్రామాల్లో వెలసిన లక్ష్మీదేవి,మారెమ్మ, గంగమ్మ, చౌడేశ్వరీదేవిలకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

35 మందికి వైద్య పరీక్షలు



పుచ్చకాయలపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి ప్రియాంక

ఉయ్యాలవాడ : మండలంలోని పుచ్చకాయలపల్లె గ్రామంలో 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారిణి ప్రియాంక తెలిపారు. గురువారం మండలంలోని పుచ్చకాయలపల్లె గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నొస్సం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది 104 వాహనంలో గ్రామానికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సమీపంలోనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు పొందాలని సూచించారు. సాయంత్రం దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి



క్రిష్టిపాడులో లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: సూర్యఘర్ పథకాన్ని ఎస్సీ, ఎస్టీలు విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ రామ్మోహన్ సూచించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్ల వరకు రూఫ్‌టాప్ సౌరవిద్యుత్ ప్రాజెక్టులను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం విద్యుత్ సిబ్బంది మీటర్లు కలిగిన వారి వివరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. క్రిష్టిపాడులో నిర్వహిస్తున్న సూర్యఘర్ లబ్ధిదారుల వివరాల నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో లైన్‌మెన్ నాగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్–1938 నంద్యాల జిల్లా అధ్యక్షులు మాధవస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం డీఈఓ జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు రాజునాయక్ నియామక ఉత్తర్వులను జారీ చేయాలన్నారు. సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా ప్రధానోపాధ్యాయులను నియమించడం సరికాదన్నారు. సీనియర్ ప్రతిపాదికన పాఠశాల సహాయకులను హెచ్‌ఎంలుగా నియమించాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న డోన్, నంద్యాల ఉప విద్యాశాఖాధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు.

మోటర్ సైకిళ్లు ఢీ.. ముగ్గురికి గాయాలు

రుద్రవరం: మండలంలోని హరినగరం సమీపంలో బుధవారం రాత్రి రెండు మోటర్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ఇద్దరు పోలీసులు, మరో యువకుడు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి అహోబిలంలో పార్వేట ఉత్సవాలు మొదలయ్యాయి. కార్యక్రమానికి బందోబస్తుగా దొర్నిపాడు పోలీస్ స్టేషన్‌ను చెందిన సిబ్బంది కొందరు వెళ్లారు. కార్యక్రమం ముగియడంతో కానిస్టేబుళ్లు చిన్న మాధవ, రాముడు ఇంటికి తిరిగి వెళ్తున్నారు. అదే సమయంలో రుద్రవరం నుంచి రమణ, ఇమాం,షుశేన్‌బాషా అనే ముగ్గురు మోటర్ సైకిల్‌పై పార్వేట ఉత్సవాలు తిలకించేందుకు వెళ్తున్నారు. రెండు బైక్‌లు హరినగరం సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో చిన్న మధు అనే పోలీస్‌కు తీవ్రగాయాలు కాగా, మరో పోలీస్ రమణ, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



ఆలమూరు పీహెచ్‌సీలో భారీ వృక్షాన్ని కొట్టి ప్రహరీపై ఉంచి దృశ్యం



వృక్షాన్ని దుంగలుగా మార్చిన దృశ్యం

నరికి.. దుంగలుగా మార్చి

రుద్రవరం: మండలంలో పచ్చదనంపై గొడ్డళ్ల వేట కొనసాగుతోంది. కొందరు దుండగులు రంపాలు, గొడ్డలతో భారీ వృక్షాలను నేల కూల్చి దుంగలుగా మార్చి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల కళ్లెదుట ఈ తంతు సాగుతున్నా.. తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో పురాతన చెట్లకు ఆయువు తీరుతోంది. చెట్లు.. ప్రగతికి మెట్లు.., కాలుష్య నివారణకు దోహద పడతాయి, కావున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని అధికారులు ప్రచార ఆర్భాటం చేస్తున్నారే గానీ.. చేతల్లో మాత్రం చిత్తశుద్ధి కొరవడింది. మండలంలోని ఆలమూరు ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో గురువారం కొందరు వ్యక్తులు గొడ్డలతో రెండు భారీ వేప వృక్షాలను కూల్చి వాటిని రంపాలతో దుంగలుగా మార్చి తరలించారు. పచ్చని చెట్లను కూల్చి వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నా రెవెన్యూ అధికారులు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించడం విమర్శలకు తావిచ్చింది. చెట్లు కూలివేతపై పీహెచ్‌సీ వైద్యాధికారి అమర్నాథరెడ్డిని ప్రశ్నించగా.. పొలాలకు వెళ్లే కరెంటు తీగలకు అడ్డువస్తున్నాయని, వాటిని కూల్చుతామని ప్రైవేటు విద్యుత్ లైన్‌మెన్ అడగటంతో ఒప్పుకున్నామని చెప్పారు.

సర్వేలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

చాగలమర్రి: హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వేను నిర్లక్ష్యం చేసే సచివాలయ సిబ్బందిపై చర్యలు తప్పవని నంద్యాల డీఎల్‌డీఓ శివారెడ్డి హెచ్చరించారు. గురువారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సచివాయ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బందితో ఎంపీడీఓ కార్యాలయంలో హౌస్ హోల్డ్ జియో టాగింగ్, ఎస్‌పీసీఐ లింకేజీ, ఎంఎస్‌ఎంఈ సర్వే, ఎన్‌ఆర్‌ఐ ఏపీ మరియు మిస్సింగ్ సిటిజన్స్ అంశాల సర్వేలో ప్రతి సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా పాల్గొని వారికి కేటాయించిన క్లస్టర్‌లలో సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం చాగలమర్రిలోని 3,4 సచివాలయ కార్యాలయాలను తనిఖీ చేసి సచివాలయ పనితీరును, రికార్డులను పరిశీలించారు. ఈఓపీఆర్డీ తాహెర్‌హుసేన్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



చాగలమర్రిలో సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న డీఎల్‌డీఓ శివారెడ్డి

రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ విశ్వనాథ్

నంద్యాల(అర్బన్): నంద్యాల డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాల్లో ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రీసర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ విశ్వనాథ్ తెలిపారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం నంద్యాల అర్బన్, రూరల్ తహసీల్దార్లు, వీఆర్వోలతో రెవెన్యూ చట్టాలు, రీసర్వే, పీజీఆర్ఎస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వేలో భూసమస్యల పరిష్కారానికి తక్షణ పరిష్కారం చూపాలన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ పీజీఆర్ఎస్‌కు వచ్చే దరఖాస్తుదారులకు నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపాలని సూచించారు. తహసీల్దార్లు ప్రియదర్శిని, శ్రీనివాసులు, రామచంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దొర్నిపాడు: బ్యాంకు ఖాతారులనే సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకున్నారని, ఖాతాలు ఖాళీ చేస్తున్నందున వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేష్ సూచించారు. గురువారం రాత్రి మండల కేంద్రంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి పాన్, ఆధార్, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నంబర్,ఓటీపీ వంటి వాటిని అడిగితే చెప్పవద్దన్నారు. అలాగే జిరాక్సు సెంటర్ల వద్దకు అవసరం నిమిత్తం వెళ్లినప్పుడు మీరు ఎన్ని తీయించుకుంటున్నారో లెక్క పెట్టుకోవాలన్నారు. లేదంటే అదనంగా జిరాక్సు కాపీలను తీసుకొని మీ డేటా తీసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని తెలిపారు. పెద్దలు చిన్నారులకు వాహనాలు చేస్తే చర్యలు తప్పవని, మద్యం , మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బొమ్మలసత్రం: నంద్యాల మండలం కానాల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో జనార్దన్‌రెడ్డి (50) గురువారం మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోస్పాడు మండలం ఎం. చింతకుంట్ల గ్రామానికి చెందిన జనార్దన్‌రెడ్డి నంద్యాల పట్టణానికి పని నిమిత్తం బైక్‌పై బయలుదేరాడు. కానాల శివారులో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ప్రమాదంలో జనార్దన్‌రెడ్డి తలకు బలమైన గాయం కావటంతో అక్కడిక్కడే కుప్పకూలాడు. స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

21న జాబ్‌మేళా

కోవెలకుంట్ల: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పట్టణంలోని వాసవీ బొమ్మడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. కళాశాలలో గురువారం జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో హీటెరో ల్యాబ్, ఆస్ట్రోటెక్ స్టీల్, ఏపీటీయూఎఫ్ వాల్వా హెచ్‌ఎఫ్‌సీ ఇండియా లిమిటెడ్, సన్‌కిసాన్ అగ్రీ అండ్ కో కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఎంఎల్‌టీ, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 97059 98057, 86886 51650 నంబర్లకు సంప్రదించాలన్నారు.



యాగంటి క్షేత్రం చేరుకున్న శ్రీ శివపార్వతుల ఉత్సవ విగ్రహాలు

ముగిసిన పారువేట

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన శ్రీ ఉమామహేశ్వరస్వామి పారువేట ఉత్సవాలు గురువారం సాయంత్రం ముగిశాయి. ఉదయం యాగంటిపల్లె నుంచి బయల్దేరిన శ్రీ శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలు పాతపాడు మీదుగా గ్రామోత్సవంగా యాగంటి క్షేత్రానికి చేరుకోవడంతో పారువేట ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం

నంద్యాల(అర్బన్) : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని డీవైఎఫ్ఐ రాష్ట్ర మాజీ నాయకుడు నాగరాజు విమర్శించారు. మెగా డీఎస్సీని నిర్వహిస్తామన్నప్పటికీ కార్యాచరణ దాల్చడం లేదన్నారు. మండలంలోని మిట్నాలగ్రామంలో డీవైఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా వలిబాషా, కార్యదర్శిగా వెంకటరాముడును ఎన్నుకున్న అనంతరం నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు పెంచి ప్రజలపై భారం మోపిందని మండిపడ్డారు.

వాహనదారులకు అవగాహన కల్పించాలి



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నంద్యాల: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో వాహన చోదకులను భాగస్వాములు చేసి రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కరపత్రాలు, ఫ్లెక్సీని కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాసోత్సవాలలో జాతీయ, రాష్ట్ర రహదారులకు సంబంధించిన బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్‌ను ప్రాముఖ్యతను వివరించడం, మద్యం సేవించి వాహనాలను నడపడం వలన జరిగే అనర్థాలపై అవగాహన కల్పించి ప్రమాదాలు నివారణకు కృషి చేయాలని సూచించారు.

విద్యాసంవత్సరాలను పరిగణనలోకి తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్) : ఉపాధ్యాయ బదిలీల్లో విద్యా సంవత్సరాలను పరిగణలోకి తీసుకోవాలని నంద్యాల జిల్లా ఏపీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివయ్య పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కూడా కొనసాగించాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్క స్వీనర్ బాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జాకీర్ ఉశేన్, వెంకటరామిరెడ్డి, మధు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

దివ్యాంగుల పెన్షన్ల పరిశీలన



లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలోని గ్రామాల్లో దివ్యాంగ పింఛన్‌దారులను గురువారం ప్రత్యేక బృందం అధికారులు పరిశీలించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన డాక్టర్లు రాజశేఖర్ స్వరూప్, మోహన్‌నాయక్, ఎంపీడీఓ అమానుల్లా, స్థానిక వైద్యులు గోపాల్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు లబ్ధిదారులను పరిశీలించారు. మండలంలో 19 దివ్యాంగ పెనన్లు నెలనెల ఒక్కొక్కరికి రూ.15వేలు అందించేవి ఉన్నాయని తెలిపారు. అందులో జిల్లెల్లలో 4, యాళ్లూరులో 7, కానాలపల్లెలో 3, దీబగుంట్ల, గోస్పాడు, పసురపాడు, జూలేపల్లె, ఎం.క్రిష్టాపురం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున పెన్షన్లు ఉన్నాయన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పాణ్యం: మామిడి రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల ఉద్యావన అధికారి దివ్య సూచించారు. గురువారం పాణ్యంలో మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం మామిడి పూతలు ఆలస్యమవుతున్న తరుణంలో రైతులు తాము సూచించిన మందులను పిచికారీ చేయాలన్నారు. తోటలకు 13.0.45 రకం 10 గ్రాముల సూక్ష్మదాతు మిశ్రమాన్ని 2 గ్రాములు ఒక లీటర్‌తో నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. 25 శాతం పూత దశలో ఉన్న తోటల్లో బ్రాసినోలిడ్ ఒక ఎంఎల్, ఇమిడాక్లోపిడ్ 0.5 ఎంఎల్ ఒక లీటర్‌కు 2 ఎంఎల్ చొప్పున కలిపి పిచికారీ చేసుకుంటే పూత వచ్చేందుకు అవకాశం ఉందని, మారుతున్న వాతావరణం కారణంగా రైతులు సకాలంలో మందులను పిచికారీ చేయాలన్నారు. అనంతరం తోటల రైతులకు సూచనలు ఇచ్చారు. ఉద్యానవన అధికారి ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.



మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యావనన అధికారి దివ్య

ప్రతి అర్జీని పరిష్కరించండి

గడివేముల: రెవెన్యూ సమస్యలపై వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాలని నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్ సూచించారు. ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను, రెవెన్యూ సదస్సులోని సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి రెవెన్యూ ఉద్యోగి సమయపాలన పాటించాలన్నారు. తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ ఎల్లా సుబ్బయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరామ్ ఆసుపత్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పోలీసులు గురువారం తెలిపారు. వారు తెలిపిన మేరకు వివరాలు.. రుద్రవరం గ్రామానికి చెందిన రమిజాబీ, పుట్టన్న, సమీరా కొలురు గ్రామంలో జరిగే జాత్రలకు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొనడంతో పుట్టన్న, సమీరాకు గాయాలయ్యాయి. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. షయం తెలుసుకున్న హైవే పోలీసలు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



బుగ్గన్నపల్లి రైల్వే స్టేషన్‌ల్లో రైల్వే విద్యుత్ డబుల్ లైన్



బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్‌ల్లో నిర్మించిన ఫుట్ వేర్ బ్రిడ్జి



సిమెంట్ నగర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి

రైల్వే స్టేషన్‌కు ఆధునిక శోభ

- బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ
- డబుల్‌లైన్, విద్యుదీకరణ పూర్తి
- ఫుట్ ఓవర్ బ్రిడ్జి, నూతన నిర్మాణాలతో ఆకర్షణీయంగా స్టేషన్
- రానున్న రోజుల్లో జంక్షన్‌గా మారే అవకాశం

బేతంచెర్ల: డోన్ నుంచి మల్కాపురం, ఆర్ఎస్ రంగాపురం, బేతంచెర్ల, బుగ్గన్నపల్లి రైల్వే స్టేషన్ ఆధునీకరణ, విద్యుత్ డబుల్ లైన్ పనులు పూర్తికావడంతో రైల్వే స్టేషన్లు నూతన శోభను సంతరించుకున్నాయి. మండలపరిధిలోని బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరించడంతో ఆకర్షణీయంగా మారింది. రైల్వే స్టేషన్‌లో నూతనంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు స్టేషన్ భవనాన్ని నూతనంగా నిర్మించారు. ప్రస్తుతం బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్ నుంచి క్రిష్ణమ్మ కొన రైల్వే స్టేషన్ మీదుగా పాణ్యం రైల్వే స్టేషన్ వరకు 19.035 కిలోమీటర్ల మేర విద్యుత్ డబుల్ లైన్ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. దీంతో గత నెల 27వ తేదీన సికింద్రాబాద్ రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, గుంతకల్ డీఆర్ఎం విజయకుమార్ తనఖీ చేసి రైళ్ల రాకపోకలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో నూతన ట్రాక్‌లపై రైలు బండ్లు పరుగు పెడుతున్నాయి. సిమెంట్ నగర్ గ్రామంలో రైల్వే విద్యుత్ డబుల్ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా సిమెంట్ ఫ్యాక్టరీలోకి వెళ్లే వాహనాలతో పాటు కందికాయపల్లె గ్రామస్తుల సౌకర్యర్థం ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. రానున్న రోజుల్లో కర్నూలు సమీపాన ఉన్న దూపాడు నుంచి ఓర్వకల్లు మండలం మీదుగా బేతంచెర్ల మండలంలోని బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్ వరకు 43 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మాణ పనులు చేపట్టడానికి రైల్వే అధికారులు సర్వే పూర్తి చేశారు. దీంతో రానున్న రోజుల్లో బుగ్గన్నపల్లి- సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్ జంక్షన్‌గా మారనుంది.



బుగ్గన్నపల్లి నూతన రైల్వే స్టేషన్

రిటైర్డ్ జవాన్ కుటుంబానికి న్యాయం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఇటీవల మృతి చెందిన రిటైర్డ్ జవాన్ దౌలత్‌ఖాన్ కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ సైనిక ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నిరంజన్‌రెడ్డితో సమావేశం అయ్యారు. న్యాయం జరిగేంత వరకు పోరాడతామని పేర్కొన్నారు. కాగా.. న్యాయం కోసం చేపట్టిన ధర్నాను మంత్రి ఫరూక్ హామీ మేరకు విరమించుకున్నామని సంఘం నాయకులు రంగనాయకులు,రాజు, సామేలు తెలిపారు.

బొలేరో ఢీకొని వృద్ధురాలికి గాయాలు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని వీసీ కాలనీలో ఓబొలేరో వాహనం ఢీకొని గురువారం వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వీసీ కాలనీలో గుర్తుతెలియని నలుగురు యువకులు మద్యం సేవించి బొలేరో వాహనం వేగంగా నడుపుతూ హల్‌చల్ చేశారు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి ఓ ఇంట్లోకి దూసుకుపోయింది. దీంతో ఇంట్లో ఉన్న సుశీలమ్మ అనే వృద్ధురాలి తలకు బలమైన గాయమైంది. స్థానికులు గుంపులుగా చేరడంతో మద్యం మత్తులో ఉన్న యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన సుశీలమ్మను స్థానిక జీజీహెచ్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బంధువులు మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.